

సృష్టిలో అతిచిన్న జీవి అయిన చీమ, ప్రకృతిని తన అధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్న బలవంతుడైన మనిషిమీద ప్రతీకారం తీర్చుకుంటుందంటే యెంత అద్భుతం! ఆ సన్నివేశం యెలాంటివాళ్ళనైనా నవ్వించదూ?

బెంగాలీమూలం: సత్యజిత్ రాయ్

# చీమకుట్టింది

తెలుగు అనువాదం: సూరంపూడి సీతారామ్

ఇవాళ నాకెంతో సంతోషంగా ఉంది. అందుకని జరిగిందంతా ఇప్పుడు చెప్పెయ్యాలనిపించింది. మీరైతే నే చెప్పేది నమ్ముతారని తెలుసు- వీళ్ళకిమల్లేకాదు. వీళ్ళనుకుంటున్నారు, నేను కల్పించి, అంతా అబద్ధం చెపుతున్నానని. అందుకే నేను వాళ్ళతో మాటాడ్డం మానేశాను.

నా పేరు సదానంద చక్రవర్తి. అంటే గడ్డాలూ, మీసాలూ పెరిగిపోయిన ముసలాడి ననుకుంటున్నారేమో! కాదూ! కాని నాకిప్పుడు నిజంగా పదమూడేళ్ళు. మరి పేరు ముసలిపేరు! ఏం చెయ్యను? నా పేరు నేను పెట్టుకోలేదుగా. మా మామ్మ పెట్టింది నా కాపేరు.

పేరు మూలాని ఇబ్బందులున్నాయని తెలిస్తే ఇంకో పేరు పెట్టేదేమో. అందరూ నన్నాక్షేపిస్తున్నారు "నీ పేరు సదానందం కదా! మరి ఎప్పుడూ అలా మొహం ముడుచుకుని ముటముటలాడతావేంరా, నవ్వు నీ జాతకంలో రాసిలేదేమిరా" అని.

నిజానికి వీళ్ళకి అసలు బుద్ధిలేదనాలి. వికవికలుగా వకవకా బిగ్గరగా నవ్వితే- అది ఆనందం కాబోలు! ఆనందం కలిగినప్పుడల్లా పైకి నవ్వేస్తారా యేమిటి? అదేం బాగుంటుంది!

మచ్చుకి చూడండి. ఏమీ అనుకోకండా మట్టిలో ఓ కొమ్మ యేదో గుచ్చారనుకోండి. ఒక సీతాకోకచిలుక ఎగిరొచ్చి దాని చుట్టూ తిరిగి దానిమీద వాలిందనుకోండి. అది చూస్తే ఎంత బాగుంటుంది! అలాగని విరగబడి నవ్వుతారా? అలా నవ్వితే పిచ్చివాడంటారు మా తాతయ్యలా. నేనెప్పుడూ ఆ తాతయ్యని చూడలేదు. మా నాన్న చెప్పారు. అయినదానికీ, లేనిదానికీ అన్నింటికీ తెగ నవ్వేవాడుట. చివరికది పిచ్చిలోకి ముదిరిపోయిందిట. అప్పుడాయన్ని గొలుసులేసి కట్టి ఓ గదిలో పడేసి తలుపులు బిగించేశారుట. అల్లా కట్టిపడేసినా అల్లాగే వెర్రిగా నవ్వుతూ ఉండేవాడుట.

అసలు సంగతేమిటంటే, నాకు ఏవయితే సరదాగా ఉంటాయో, అవి వీళ్ళెవరూ గమనించనైనా గమనించరు. నా మంచంమీద పడుకునే చూస్తూ వుంటే నాకు ఎన్నెన్నో కంటపడతాయి. చుట్టూ దూది రేకులతో ఎగిరొస్తుంది బూరుగు చెట్టు విత్తనం. అది గాలిలో అల్లా అల్లా ఎగురుకుంటూ వస్తుంది. అటూ, యిటూ గాలిలో తేలుతూ తడాబడుతూ వుంటుంది. చుట్టూ పొడుగ్గా తీగెల్లా వుంటాయి దూది రేకులు. ఒకోసారి మొహం దగ్గరదాకా వస్తుంది. ఉఫ్ అని ఊదేసరికి తిన్నగా పై దూలాలదాకా ఎగిరిపోతుంది.

కిటికీ అంచుమీద వచ్చి వాలుతుంది కాకి. అప్పుడు కదలకుండా, మెదలకుండా కొయ్యబొమ్మలా వుండిపోయి దానికేసే చూస్తాను. అది అక్కడ కాకి అరుపులే అరుస్తూ సర్కస్ చేస్తున్నట్టే ఉంటుంది.

కాని అన్నింటికన్నా సరదాగా వుంటుంది చీమల్ని చూస్తూ వుంటే. ఇప్పటికి ఏడాది క్రితం ఒకసారి నాకు జ్వరం బాగా ఎక్కువగా వచ్చింది. జ్వరం రావడం నాకు కొత్త కాదు. తరుచు వస్తూనే వుంటుంది చలిజ్వరం. అమ్మ అంటూ వుంటుంది- పొద్దస్తమానూ తడి మట్టి

లోనూ, పచ్చగడ్డిలోనూ తిరుగుతూ వుంటే రాక యేమవుతుందని.

జ్వరం వస్తే ఇంక స్కూలుండదు. మంచం మీద పడుకుని కిటికీ అవతల తురాయి చెట్టుమీద ఉడతల పరుగులు చూస్తున్నాను. ఇంతలోకే అమ్మ ఏదో చేదు మందు తీసుకొచ్చింది మింగమని. ఆ ఆటలు చూసే తమకంలో, మారు మాట్లాడకండా బుద్ధిమంతుడిలా ఆ చేదు మందు ఒక్క గుటకలో మింగేసి కొంచెం నీళ్ళు పుక్కిలించి కిటికీలోంచి ఉమ్మేశాను. అమ్మ సంబరపడి వెళ్ళిపోయింది. నేను దుప్పటి లాక్కుని ముడుచుకుని ఒత్తిగిలి పడుకునేసరికి, నా కంటికి ఒకటి కనపడింది. నేను ఉమ్మేసిన నీళ్ళు కొంత కిటికీ అంచుమీద పడ్డాయి. ఆ నీటిలో ఒక నల్లచీమ పడి మునగానాం. తేలానాంగా కొట్టుకుంటోంది. లేచి కూచుని బాగా దగ్గరకి జరిగి చూశాను. తదేకంగా దానికేసే చూస్తూఉంటే క్రమంగా, ఆ చీమ చీమ కాదనిపించింది చీమ కాదు, మనిషి అన్నట్టు తోచింది. మనిషంటే ఝుంటూ గారి అల్లుడుగారు. ఆ అల్లుడుగారు చేపలు





పట్టడానికని వెళ్ళి, బురదలో కాలుజారి చెరువులో పడిపోయాడు. ఆయనగారికి ఈత రాదు. నీళ్ళలో బుడుగూ బుడుగూ మునుగుతూ, నీళ్ళు తాగుతూ, చేతులూ కాళ్ళూ కొట్టుకోడం మొదలెట్టాడు. అప్పుడు ఝుంటూగారి అన్నగారు, వాళ్ళ పాలేరు నరహరీ వెళ్ళి ఆయన్ని నీళ్ళలోంచి లాగి పైకి తీసి ప్రాణాలు రక్షించారు.

అది జ్ఞాపకం రాగానే, పాపం ఈ చీమని రక్షిద్దాం అని తోచింది నాకు. జ్వరంతో అలాగే లేచివెళ్ళి, పక్కగదిలో నాన్నగారి రైటింగ్ పాడ్‌లోనించి చిన్న బ్లాటింగ్ పేపరు ముక్క చింపి తీసుకొచ్చాను. ఒక్క అంగలో కిటికీదగ్గరకి వెళ్ళి బ్లాటింగ్ పేపరుముక్క పెట్టేసరికి, అది నీళ్ళు యిట్టే పీల్చేసింది. ఆ చీమ అకస్మాత్తుగా నీళ్ళు పోవడం చూసి కంగారుపడిపోయింది. అటూ, యిటూ యేమిటా అని ఒకసారి పరకాయించి చూసి, తరవాత కిటికీ తూములోకి దూరిపోయింది.

ఆ రోజు మళ్ళీ చీమ కనపడలేదు.

మర్నాడు జ్వరం కొంచెం యెక్కువయింది. మధ్యాహ్నంవేళ అమ్మవచ్చి, "ఏమిట్రా అలా గుడ్లెట్టుకుని కిటికీలోకి చూస్తావ్? ఇంత జ్వరం వొళ్ళు కాలిపోతోంది. నిద్ర వొచ్చినా రాకపోయినా కళ్ళు మూసుకుని కదలకండా పడుకోరాదూ?" అని.

అమ్మకోసమని కళ్ళు మూసుకున్నాను. అమ్మ అటువెళ్ళి వెళ్ళగానే మళ్ళీ కళ్ళు తెరిచి కిటికీ తూముకేసి చూడ్డం మొదలెట్టాను సాయంకాలం వేళ. సూర్యుడు తురాయిచెట్టు వెనక్కి వాలుతున్న వేళ అప్పుడు కనపడింది ఒక చీమ-కిటికీ తూములోంచి తొంగి చూస్తోంది చూసి చూసి ఒక్కసారి హఠాత్తుగా తూములోంచి యివతలకి వచ్చి కిటికీలో పచార్లు చెయ్యడం మొదలెట్టింది

చీమలన్నీ ఒక్కలాగే కనపడతాయి. అయినా, నాకు ఎందుకో అనిపించింది, ఇది నిన్న నీటిలో మునుగుతూ తేలుతూ అవస్థపడినదే అయుండకూడదా అని నేను దాన్ని కాపాడాను కాబట్టి, అది సాహసం చేసి నన్ను చూడ్డానికి వచ్చిందేమో అనిపించింది ఇంతకుముందే చాటుగా ఒక చిన్న పొట్లంలో పంచదార తెచ్చి తలగడ కింద పెట్టుకున్నాను. అది తీసి, అందులోంచి ఒక పంచదార పలుకు ఎంచి కిటికీలో పెట్టాను

చీమ ఉలిక్కిపడి హఠాత్తుగా నిలబడిపోయింది. ఆ తరువాత మెల్లిగా జాగ్రత్తగా ఆ పంచదార పలుకు దగ్గరగావచ్చి చూసింది. దాన్ని అటుపక్క నించి ఒకసారి, ఇటుపక్క నించి ఒకసారి, తరవాత చుట్టూ తిరిగి పరకాయించి చూసింది. ఆ పైన ఏమనుకుందో యేమో, దబాల్న తూములోకి దూరిపోయింది.

ఇది బాగుంది! ఇంత చక్కని తీపి పలుకు దానికిచ్చాను. మరి చీమగారు దాన్ని అట్టే వొదిలేసి అలా పారిపోయారేమిటి?

కొద్ది సేపటికి డాక్టరుగారొచ్చారు. వచ్చి నాడిచూశారు. నాలుక చూశారు. స్టెతస్కోపుతో ఛాతీ వీపూ పరీక్ష చేశారు.

# మహిషాసుర మర్దని



మహిషాసురుని దాహాబలం పిరంతుశమైనది ।
మహిలో సన్మార్గ సంచారులకు దుస్సహమైనది ।।
తపస్సాచరించి భీకర శక్తుల నాతడు సాధించినాడు ।
కృపాశూన్యుడై చరించి నరుల సురల బాధించినాడు ।।

కారుచీకటులు పేరుకొని నాలుగు మూలల మూగినవి ।
దారితోచక ఎల్లవారి గుండెలు తల్లడిల్ల సాగినవి ।।
హరి హరాదులకు సైత మజేయుడా దుష్ట దానవుడు ।
మొరబెట్టుకొనె లోకాలు రాజరాజేశ్వరీదేవి నపుడు ।।

జాలిగా వినిపించె దీనార్తుల వేదనా రోదనమ్ములు ।
ఆలకించిరి శ్రీవాణి గిరిజలు ముగురమ్మలు ।।
అకళంకమైన తమ కళల నొకచోట కూర్చినారు ।
త్రికళామూర్తిని మహత్తేజస్మూర్తిని సృష్టించినారు ।।

ఆదిశక్తి త్రికళ సంగరరంగమ్మున మహాకాళి ।
ఆ సుర గర్వాంధకారాన్ని వారించిన గ్రీష్మ వేళాహేళి ।।
మహిషాసుర మర్దని రుద్రాణి దుష్టసంహారిణి ।
మహాదేవి ఆశ్రిత జనతా మనోవని విహారిణి ।।

—డాక్టర్ వింజమూరి

చిత్రం : శ్రీ పొన్నాడ మూర్తి

చూసి చూసి అన్నారు- ఆ చేదుమందు యింకా తీసుకోవాలని. తీసుకుంటే రెండు రోజుల్లో జ్వరం జారిపోతుందని నాకు మాత్రం యిదేం నచ్చలేదు జ్వరం తగ్గిపోతుందంటే మళ్ళీ స్కూలు. స్కూలు అంటే మధ్యాహ్నం వేళ నష్టం మధ్యాహ్నం వేళే వస్తాయి చీమలు కిటికీలోకి.

డాక్టరుగారు వెళ్ళగానే యిటు తిరిగి కిటికీలో చూశాను ఈ మాటు ఒకటికాదు. బారులుతీరి చీమలు తూములోంచి అదే పనిగా వచ్చేస్తున్నాయి. అంటే మొదట కనపడ్డ ఆ చీమ. నా నేస్తం. వెళ్ళి తన చీమ సమాజానికి పంచదార సంగతి దండోరావేసి వచ్చిందన్నమాట. ఆ చీమల బుద్ధి, తెలివి, యుక్తి కళ్ళారా చూస్తూ కూచున్నాను. చీమలన్నీ ఏకమై. ఆ ఒక్క పంచదార పలుకునీ తూము వేపుకి సాయం పట్టి తీసుకుపోతున్నాయి ఇదంతా స్వయంగా చూస్తే తప్ప. చెపితే నమ్మే విషయంకాదు. మనుషుల్లాగే అవి కూడా. "హైలేసా ! పట్టరబాబూ !" అని గుంపుగా హెచ్చరించుకుంటూ బరువు మోసుకుపోతున్నట్టుంది.

జ్వరం తగ్గాక స్కూలంటే కొన్నాళ్ళు విసుగ్గా ఉండేది క్లాసులో కూచుంటే నా గది,కిటికీయే జ్ఞాపకం వచ్చేది. అక్కడ ఎన్నిచీమలు వస్తూ పోతూ ఉంటాయో ఈపాటికి. రోజూ స్కూలుకి వచ్చేముందు రెండు మూడు పంచదార పలుకులు కిటికీలో పెట్టి వచ్చేవాణ్ణి. సాయంత్రం వెళ్ళిచూస్తే ఆ పలుకులు ఉండేవి కావక్కడ.

క్లాసులో నా సీటు ఒక మధ్యబెంచీలో ఉండేది. ఒక రోజు స్కూలికి రావడం ఆలస్యం అయింది. వచ్చిచూస్తే నా జాగాలో ఫణి కూచుని ఉన్నాడు ఇంకేం చెయ్యను? వెనక బెంచీమీద గోడవారన ఖాళీజాగా వుంటే అక్కడ కూచున్నాను. టిఫిన్‌కి ముందు పీరియడ్ హిస్టరీ హారాధన్ మాస్టారు హానిబల్ వీరకృత్యాలను గురించి చెపుతున్నారు. హానిబల్. కార్థేజ్ నించి పెద్ద సైనికబలంతో ఆల్ప్స్ పర్వతాలు దాటి ఇటలీని ఆక్రమించాట్ట. నా ఆలోచన వెంటనే చీమల దండు మీదికి పోయింది. పక్కగోడమిద ఆ చివరనించి ఈ చివరకి పెద్ద పెద్ద బారులు తీర్చిపోతున్నాయి. నల్లటి బుల్లిబుల్లి చీమలు సైన్య వాహినుల్లాగా కదిలిపోతున్నాయి. అవి వేలు కావు లక్షలుకావు. ఇంకెన్నో. గోడ పైనించి కిందిదాకా చూశాను కిందివేపు ఒక చోట ఒక నెరద వుంది. ఆ నెరద లోంచే బారులుతీరి వస్తున్నాయి లెక్కలేనన్ని చిన్ని చిన్ని చీమలు.

టిఫిన్ గంట కొట్టే కొట్టగానే బైటికి పరుగెత్తాను. సరిగ్గా మా క్లాసు గది గోడ వెనకవైపుకి చీమల బారులు అక్కడ గోడ నెరదలోంచి క్లాసు గది లోపలకి పోతున్నాయి. అటుచూస్తే ఈ నెరద నించి నేల మీది గడ్డిపోచల మధ్యలో నించి బారులు పెట్టి అంత దూరంలో జామచెట్టుదాకా పాకిపోయాయి. చీమల బారువెంట పోయి జామచెట్టు మొదట్లో చూస్తే అక్కడ పుట్టలు. ఆ పుట్టలు పూర్వకాలపు కోటల్లాగే వున్నాయి. ఎత్తైన గుట్ట. దానికొక పెద్ద ద్వారం. ఆ ద్వారంలోనించి వేలూ లక్షలూ చీమల సైన్యం బారులుతీరి రాకపోకలు. ఆ కోటలో ఏముందో చూడాలనిపించింది. జేబులో పెన్సిల్ తీసి దాంతో పుట్టమీది మట్టి మెల్లిగా తొయ్యడం మొదలెట్టాను. మొదట్లో ఏం కనపడలేదు. తీసినకొద్దీ చూస్తే ఆశ్చర్యం వేసింది. వాటిలో మళ్ళీ చిన్ని చిన్ని పుట్టలూ ఆ పుట్టల్ని ఒకదాంతో ఒకటి కలిపే సొరంగాలు. ఎంత ఆశ్చర్యం! ఆ చిన్ని చిన్ని కాళ్ళతో ఇంత మహాదుర్గాన్ని ఎలా నిర్మించుకున్నాయి! వీటికి ఈ తెలివీ, ఉపాయం ఎలా వచ్చాయి! వీటికికూడా స్కూళ్ళున్నాయా? టీచర్లున్నారా? చదువుకుంటాయా? లెక్కలు నేర్చుకుంటాయా? బొమ్మలు గీస్తాయా? పనులు నేర్చుకుంటాయా? మరయితే వీటికీ, మనుషులికీ తేడా యేం లేదన్నమాట- మొహాలూ దేహాలూ తేడా తప్ప! మరి పులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు, గుర్రాలు వాటియిళ్ళు అవి కట్టుకోవెందుకని? పెంపుడుకుక్కలు మిగతా కుక్కలూకూడా అంతేగా! పక్షులైతే గూళ్ళు కట్టుకుంటాయి. అవి బాగా చిన్నవి. వాటిలో పక్షులు ఎన్నని వుండగలవు? చీమలకి మల్లే వేలూ లక్షలూ నివసించేలా కట్టుకోగలవా మరి?

[illegible] రాగం కొంత కదిలించేసరికి చీమల్లో పెద్ద కల్లోలం బయలుదేరింది. పాపం, అవి [illegible]. అవి నా నేస్తాలు. నన్ను గుర్తుపట్టుకుంటాయేమో ఇప్పుడు? వీటికేదో ఉపకారం చెయ్యాలి. మర్నాడు స్కూలికి వచ్చేటప్పుడు [illegible] అమ్మ సందేశ్ ([illegible]) ఇచ్చింది. [illegible] సగం తిని. మిగతా సగం పొట్లం కట్టి పాంట్ జేబులో పెట్టుకున్నాను. స్కూల్లో గంటకొట్టే ముందే జామచెట్టు దగ్గరకెళ్ళి ఆ సందేశ్ ముక్క తీసి పుట్ట దగ్గర పెట్టాను. పాపం తిండి కోసం అవి ఎంతెంత దూరాలు వెతుక్కుంటూ పోవాలో. ఇవాళ వాటికోట




గుమ్మం ముందే ఆహారం పెద్ద కొండ గుట్టలా వాటికి దొరుకుతుంది.

ఆ తరవాత కొన్నాళ్ళకి స్కూలుకి వేసవి సెలవు లిచ్చారు. అప్పటికి చీమల్తో నా స్నేహం బాగా బలపడింది. నేను చూసిన సంగతులు పెద్దవాళ్ళకి చెపుతే, వాళ్ళు అసలు వినిపించుకోడమేలేదు. నా మాటలకి వాళ్ళు నవ్వడం చూస్తే కోపం వస్తుంది ఇంక యెవ్వరితోనూ ఏమీ చెప్పకూడదని అసలు మాట్లాడనే కూడదని నిశ్చయించుకున్నాను.

ఒక రోజు యేమయిందంటే....

మధ్యాహ్నంవేళ. రుంటూ వాళ్ళ యింటి పిట్టగోడ దగ్గర ఎర్ర చీమల పుట్ట వుంటే చూస్తున్నాను. ఎర్ర చీమలపుట్ట దగ్గరకి పోకూడదంటారు. ఎర్రచీమలు కుట్టితే మంటలూ, పొట్లూ. ఇదివరలో నన్ను చీమలు కుట్టకపోలేదు. కాని కొన్నాళ్ళనించి అవి నన్ను కుట్టడం లేదు అందుకని నిర్భయంగా అక్కడ కూచుని చూసున్నాను. ఇంతలో అక్కడికి భీకూ వచ్చాడు వాడి అసలు పేరు శ్రీకుమార్. మాక్లాసే. నాకన్న పెద్దవాడు. అప్పుడే గడ్డం మీసం కనబడుతున్నాయి. ఊరికే అందరి మీద పెత్తనం. అధార్టీ చలాయిస్తాడు. వాడంటే ఎవరికీ ఇష్టం లేదు. నాకూ ఇష్టంలేదు కాని వాడితో ఎన్నడూ కొట్లాటకి దిగలేదు. వాడికి బలం ఎక్కువ. నన్ను చూసి దగ్గర కొచ్చాడు "ఒరే చవటా! అక్కడ కూచుని ఏం చేస్తున్నావురా?" అన్నాడు. నేను విననట్టు ఊరుకున్నాను. అయినా మీద మీద కొచ్చి" ఏమిరా? ఏం మళ్ళీ ఒంట్లో బాగా లేదా యేం?" అన్నాడు. వాడి వరసచూస్తే బాగాలేదు. పోనీ అని ఉన్నసంగతి చెప్పేశాను విని

"ఏమిటీ? చీమల్ని చూస్తున్నావా? వాటిలో ఏముందిరా చూడ్డానికి? అవి మీ యింట్లో లేవా? ఇంత దూరం వచ్చి చూడాలా వాటికోసం?" అన్నాడు.

నాకు భలే కోపం వచ్చింది. నే నేం చేస్తే వీడికెందుకుట? అన్నింట్లో నూ వేలు పెట్టాలి కాబోలు. వెధవ పెత్తనం వీడూను.

నే చెప్పాను: "నాకు చూడ్డం బాగుంటుంది కాబట్టి. నేను చూస్తున్నాను ఈ చీమలసంగతి నీకు బోధపడదులే నీ కిష్టమయింది నువ్వు చూసుకో. నన్నెందుకు విసిగిస్తావ్ యిక్కడికొచ్చి?"

నా మాటలకి వాడికి కోపంవచ్చి కంయి మంటూ లేచాడు. "ఓ. అలాగేం? చూడ్డానికి బాగుంటుందేం? అయితేమరి చూడు: చూడరాచూడు" అంటూ నేను కల్పించుకోడానికి ముందే తన చేతికర్రతో చీమల పుట్టమీద దబాదబా బాదడం మొదలెట్టాడు. పుట్ట కాస్తా నేలమట్టం అయిపోయింది. బోలెడు చీమలు నుగ్గునుగ్గయి చచ్చిపోయాయి!

తన కసి తీర్చుకుని భీకూ పకపకా నవ్వుతూ వెళ్ళిపోతూ వుంటే నాకు తలలో మంటా వేడీ పుట్టి పిచ్చి కోపం వచ్చేసింది. ఒక్కదూకుతో వాడి వీపుమీద పడి, వెనకనించి వాడి జుట్టు పిడికిట్లో పుచ్చుకుని, వాడి తలకాయ గోడకేసి నాలుగ్గు దుసాన్ల పడాపడా కొట్టాను. క్రాస్ట్ విడిచిపెట్టేసరికి కుయ్యో మొర్రోమంటూ ఏడుస్తూ ఇంటికారి పట్టాడు నేను ఇంటికి చేరకముందే భీకూ మా యింటికి వెళ్ళి నామీద ఫిర్యాదు చేశాడు కాని ఆశ్చర్యం! అమ్మ నన్ను మొదట తిట్టనూ లేదు, కొట్టనూలేదు నేను ఎన్నడూ ఎవరి ఒంటిమీదా చెయ్యి వెయ్యనని అమ్మకి తెలుసు అదిగాక నాకు భీకూ అంటే భయం అని కూడా అమ్మకి తెలుసు.

అమ్మ నన్నడిగేసరికి. నేను అబద్ధం చెప్పలేదు. నే చెప్పింది విని అమ్మ నిర్ఘాంతపోయింది "ఏమిటీ! ఏమన్నావ్? భీకూ బుర్ర గోడకేసికొట్టడం నిజమే నంటావా?"

"అవును. నిజమే. భీకూనేకాదు చీమల పుట్టజోలికి ఎవరొచ్చినాసరే తల చితక బొడిచేస్తాను" అన్నాను.

అమ్మకి నామీద చాలా కోపం వచ్చేసింది. మొట్టికాయలు వేసి. వీపుమీదబాది. నన్ను గదిలో పెట్టి తలుపు గడియవేసింది.

ఆ రోజు శనివారం. నాన్న కోర్టు నించి పెందలాడే వచ్చారు. అమ్మ చెప్పిందంతా విని. గది బయట తాళం కూడా వేయించారు. నాకు వీపు మీద కొంచెం మంట


గానే వుంది అమ్మ కొట్టిన దెబ్బలకి. అయినా బాధపడలేదు నేను. కాని అన్ని చీమలు అలా చచ్చిపోయినందుకు ఏడుపొచ్చేసింది. అప్పుడో సారి అక్కావాళ్లు వుండే సాహెబ్‌గంజ్ దగ్గర రెండురైళ్ళు ఢీకొని మూడువందలమందిదాకా జనం చచ్చిపోయారని విన్నాను. ఇవాళ ఢీకూ లాఠీతో మూడుదెబ్బలకే ఎన్నో చీమలు చచ్చిపోయాయి. ఎంత అన్యాయం! ఎంత అన్యాయం!

పక్కమీద పడుకున్నా నన్నమాటేగాని ఒళ్ళంతా నొప్పులు. చెవుల్లో హోరు. తల దిమ్ముగా తిరుగుతున్నట్టుగా వుంది. కొంచెం చలికూడా వేస్తోంది. దుప్పటి లాక్కుని కప్పుకుని పక్కకి తిరిగి కాళ్ళు ముడుచుకుని పడుకున్నాను. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. అప్పుడేదో చిత్రమైన శబ్దం వినబడి నిద్ర మెలకువొచ్చేసింది. అదేదో నాజూగ్గా, కీచుగా, అతి సన్నటి స్వరం. తియ్యగా వినపడుతోంది. ఎటు వేపునించి వస్తోందో తెలీదు ఎక్కడో చాలా దూరంనించీ పాట వినవస్తోందనిపించింది. అయితే ఇటువంటి పాట ఎన్నడూ వినలేదు. ఆ పాట అతి సన్నగా వస్తోందని జాగ్రత్తగా ఆలకిస్తున్నాను. ఇంతలో కిటికీ తూములోనించి వచ్చింది. ఓ చీమ అది ఆనాడు నేను కాపాడిందే ననుకుంటాను. అనుకోడమేమిటి, అదే నని నాకు బాగా గుర్తే! ఆ చీమ నాకేసి చూస్తూ, ముందు రెండు కాళ్ళూ యెత్తి మీసాల దగ్గరగా పెట్టి. నాకు దణ్ణం పెట్టింది మరి దీనికి ఏం పేరు పెట్టాలి? నల్ల చీమ. 'కాళీ' అనా? 'కిష్టు' అనా? 'కాలాచంద్' అంటే? ఆలోచించిపెట్టాలి. నేస్తం అయింతరవాత పేరు లేకండా ఎల్లాగ?

మెల్లిగా కిటికీలోకి అరచెయ్యిజాపాను. ఆ చీమ ముందు కాళ్ళు రెండూ దింపి మెల్లిగా నా చేతివేపుకి రావడం మొదలెట్టింది వచ్చి మెల్లిగా చిటికిన వేలు మీంచి అరచేతిలోకి వచ్చింది. అరచేతిలో నదుల మాదిరిగా వున్న గీతల్లో అటూ, ఇటూ తిరిగి చూడ్డం మొదలెట్టింది.

సరిగ్గా ఈ సమయంలో గది తలుపు దగ్గర చప్పుడయింది. నేను ఉలిక్కిపడ్డాను. చెయ్యి వణికేసరికి. చీమ గభాల్న పరుగెత్తిపోయి కిటికీ తూములో దూరి దాక్కుంది.

అమ్మ తలుపు తాళంతీసి లోపలికొచ్చి నాకో గ్లాసు పాలు తాగించింది. నా కళ్ళకేసి చూసి. నుదురు తాకి మళ్ళీ జ్వరం వచ్చిందని చూసింది.




మర్నాడు పొద్దున డాక్టరుగా రొచ్చారు. అమ్మ చెప్పింది "రాత్రి తెల్లవార్లూ సరిగా నిద్రపోనేలేదు. కదుల్తానేవున్నాడు. కాళీ కాళీ అంటున్నాడేమిటో!" నేను దేని పేరు తల్చుకుంటున్నా ననుకుంది అమ్మ పాపం! డాక్టరుగారు నా వీపుమీద స్టెతస్కోపుపెట్టి చూస్తూవున్న సమయంలో మళ్ళీ నాకు ఆ సన్నని కీచుపాట వినవచ్చింది. నిన్నటికన్నా ఇంకొంచెం చక్కగా వినపడింది. స్వరం ఇంకోలా వుంది. ఆ పాట కిటికీ తూములోనించే వొస్తోందనిపించింది. డాక్టరుగారు పరీక్ష చేస్తున్నందువల్ల అటు తిరిగి చూడ్డానికి వీల్లేకపోయింది.

పరీక్ష కాగానే డాక్టరుగారు లేచి నించున్నారు. నేను మెల్లిగా అటు తిరిగిచూశాను అరే! ఇంకో నేస్తం ఇవాళ! ఎండచీమ! అదికూడా నాకు నమస్కారం చేస్తున్నట్టుంది. అయితే చీమలన్నీ నాకు నేస్తాలేనా! మరి ఆ పాటలుకూడా చీమలే పాడుతున్నాయా? కాని అమ్మకి ఆ పాట వినపడ్డట్టులేదు ఆ మాటెత్తలేదు. అమ్మని అడుగుదామా అని యిటుతిరిగి చూసేసరికి అమ్మ కళ్ళు పెద్దవి చేసుకుని కిటికీలోకే చూస్తోంది. హఠాత్తుగా టేబిల్ మీదున్న నా లెక్కల పుస్తకంతీసి టప్పుని కొట్టి చీమల్ని ఒక్క దెబ్బతో చంపేసింది. దాంతో ఆ పాట కూడా ఆగిపోయింది.

అమ్మ అంటోంది: "అబ్బబ్బ! ఈ చీమలు ఏం చంపేస్తున్నాయమ్మా! తలగడా యెక్కొచ్చి చెవుల్లోకూడా కుడతాయా ఏం కర్మ?"

డాక్టరుగారు ఒక ఇంజక్షన్ యిచ్చి వెళ్ళగానే చచ్చిపోయిన చీమలకేసి చూశాను అయ్యయ్యో! ఎంత చక్కని పాట వినిపిస్తూ చచ్చిపోయాయి! మా తాత ఇంద్రనాథ్ చాలా చక్కగా పాడేవాడు. మాకు అంత తెలిసేది కాదు గాని. పెదవాళ్ళు చెప్పేవాళ్ళు. అచ్చం ఉస్తాద్‌లా పాడగలడని. ఆయన కూడా ఓ రోజున యిలాగే తంబురా వాయించి పాడుతూ పాడుతూ అకస్మాత్తుగా చచ్చిపోయాడు ఆయన్ని శ్మశానానికి తీసుకుపోయేటప్పుడు. భజన మేళం కొందరు వచ్చి హరికీర్తనలు పాడుతూ కూడా వెళ్లారట. అప్పుడు నాకింకా బాగా చిన్న వయస్సు.

కిటికీ వేపుకి తిరిగి మళ్ళీ చూస్తే ఆ చచ్చిన చీమలు లేవు. ఈ సారి జ్వరం ఓ పట్టాన నన్ను వదిలిపెట్టలేదు. ఎల్లాపోతుంది? వీళ్ళంతా పాపం చేస్తున్నారు. ఇంట్లో అందరూ ఏకమై చీమలమీద దాడి చేసి చంపేస్తున్నారు. ఆ చీమలు ఆర్తనాదం చేస్తే? అవి వింటూ వుంటే రోజంతా? జ్వరం మరెల్లా పోతుంది? ఎక్కువ కాదామరి? మరో చిక్కొచ్చి పడింది. అటు వంటింట్లోనూ, స్టోర్‌రూంలోనూ, వీధి అరుగుమీనా చీమల్ని హతమార్చేస్తూవుంటే. ఇటు నా కిటికీలోకి ఓ చీమలదండు వచ్చి గోలచేసి రాగాలు పెట్టేస్తున్నాయి. నేను కలగచేసుకుని వాటికి సాయం చెయ్యాలని వాటి ప్రార్థన కాబోలు! అటు వాళ్ళ హత్యాకాండ ఆపగలనా? వాళ్ళని వారించగలనా? నాకా ఒంట్లో బాగా లేదు. లేవలేను. బొత్తిగా సత్తువ తగ్గిపోయింది అది కాకపోయినా చిన్నవాళ్ళు చెపితే పెద్దవాళ్ళు చెవిని పెడతారా! చివరికేదో ఓ రోజు ఏదో ఒకటి చేసెయ్యాలి.

ఒక రోజు బాగా చీకటితోనే మెలుకువ వొచ్చేసింది. పనిమనిషి కుంయ్యో మొర్రో మంటోంది. రాత్రి వేళ కండచీమొకటి ఆమె చెవిలో దూరి కుట్టేసిందట. నాకు తెగ నవ్వొచ్చింది. కాని అంతల్లోనే తపాతపా చప్పుళ్ళు. ఆర్తనాదాలూ వినవచ్చాయి. చీమల్ని హతంచేసే కాండ ఆరంభమయిందన్న మాట! ఇంతలో ఇంకో గొంతు వినపడినట్టు తోచింది. "బాబోయ్ రక్షించండి మమ్మల్ని కాపాడండి" అని కిటికీ వేపు తిరిగి చూస్తే. గుంపులు గుంపులుగా చీమలు వచ్చేసి కంగారుగా అటూ, యిటూ పరుగులు తీస్తున్నాయి. నేనింక ఊరుకోలేకపోయాను. నా జ్వరం గిరం మరిచిపోయి. మంచంమీంచి ఒక్క దూకు దూకి వరండాలోకి వచ్చిపడ్డాను. కాని ఏం చెయ్యాలో వెంటనే తోచలేదు ఆపైన చేతికందిన కూజాయెత్తి నేలకేసి పగల

కొట్టాను చేతికేది అందితే అది పుచ్చుకుని నేలకేసికొట్టడం మొదలుపెట్టాను.

నా ఉపాయం బాగా పనిచేసింది. నా గొడవ చూసి అందరూ చీమల హత్యాకాండ వొదిలేసి ఇటు పరుగెత్తుకొచ్చారు అమ్మ. నాన్న. చిన్నత్త. సావిత్రక్క. ఎవరి గదిలోంచి వాళ్ళు బైటపడి అందరూ వొచ్చేశారు. నన్ను పట్టుకుని కాళ్ళూ చేతులూ పట్టుకుని లేవదీసి గంజీ కావిడీ పట్టి తీసుకెళ్ళి మంచం మీద పడేశారు. పడేసి. గది తలుపులు వేసి తాళం పెట్టేశారు.

నాకు లోలోపల బాగా నవ్వొచ్చింది. నా కిటికీలో చీమలు ఆనందంతో నాట్యం చేస్తూ సెబాస్ అంటున్నాయా అనిపించింది! అంటూ అవి వెళ్ళిపోయాయి!

ఆ తరవాత నన్ను అట్టే రోజులు ఇంట్లో వుండనియ్యలేదు. ఒక రోజున డాక్టరుగారు వచ్చి చూసి. పరీక్ష చేసి. ఇంక ఇంట్లో వుంటే సరైన చికిత్స జరగదనీ. నన్ను ఆస్పత్రిలో చేర్చాలనీ చెప్పేశారు.

ఆస్పత్రిలో నన్నో విడి గదిలో వుంచారు. నాలుగు రోజులయింది ఇక్కడ చేర్చి. మొదట నాకు ఆ గదిలో వుండబుద్ధి కాలేదు. అంతా ఎంత శుభ్రంగా వుందంటే. ఇక్కడ చీమలు దూరడానికి యెక్కడా ఆస్కారంలేదు. కొత్తగా కట్టిందేమో. గోడల్లో యెక్కడా నెరదనేదిలేదు- అలమారా ఒక్కటీలేదు. దేనిచాటునైనా చీమలుండ వచ్చనుకుంటే. ఒక్కచోట ఒక్క నెరద కనపడింది కాని. అక్కడంతా శుభ్రంచేసివుంది. ఒక కిటికీవుంది- దానికి అవతల మామిడిచెట్టు తల కనపడుతోంది. దానికొమ్మ ఒకటి కిటికీకి. కొంచెం అందుబాటులోవుంది. చీమలంటూ యెక్కడేనావుంటే ఆ కొమ్మ పైనుండాలింక.

మొదటిరోజు కిటికీ దగ్గరకి వెళ్ళడానికి వీల్లేకపోయింది. ఏం చెయ్యడం? రోజంతా డాక్టర్లు. వాళ్ళు కాకపోతే నర్సులూ. ఇంక మా వాళ్ళూ అస్తమానూ వస్తూపోతూనే వున్నారు. రెండో రోజూ అంతే. మనస్సు వికలమైపోతోంది. అక్కడికీ ఓ మందు సీసా విసిరికొట్టాను. అది పగిలిపోయిందని కొత్త డాక్టరుగారికి చెడ్డకోపం వచ్చేసింది. ఆయన బొత్తిగా మంచివాడు కాడని తెలిసిపోతూనే వుంది ఆయన మీసాలూ. కళ్ళజోడూ చూస్తే.

మూడో రోజుని ఒకటి జరిగింది. అప్పుడు గదిలో యెవ్వరూ లేరు- ఒక నర్సు మాత్రం గదిలో ఓమూల కుర్చీలో కూచుని ఒక పుస్తకం చదువుతోంది నేను పడుకుని ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో చిన్న చప్పుడయింది. నర్సుకి కునుకు వచ్చినట్టుంది. ఆమె చేతిలో పుస్తకం జారి కింద పడింది. చప్పుడు కాకుండా మెల్లిగా మంచందిగి కిటికీ దగ్గరకి వెళ్ళాను అడుగులో అడుగు వేసుకుంటూ కిటికీ కింది కమ్మీమీద కాలు వేసి మెల్లిగా పైకిలేచి. చెయ్యి చాపి మామిడి కొమ్మ అందుకోడానికి ప్రయత్నించాను. ఇంతలో రెండోకాలు కిటికీ కమ్మీకి తగిలి టక్కుమని చప్పుడయింది- ఆ చప్పుడు విని నర్సుకి నిద్రాభంగం అయింది. కళ్ళెత్తి చూసి కెవ్వుమని అరిచింది. అరిచి ఒక్క వుదుట్లోవచ్చి నన్ను అమాంతం వాటేసుకుంది. లాక్కొచ్చి మంచంమీద పడేసింది ఇంతలో యెవరెవరో పరుగెత్తుకుంటూ వచ్చారు. డాక్టరుగారొచ్చి ఒక ఇంజక్షన్ యిచ్చేసి వెళ్ళిపోయారు.

వాళ్ళ మాటల్నిబట్టి నేను కిటికీలోంచి కిందికి దూకెయ్యడానికి ప్రయత్నించానని తల్చినట్టు బోధపడింది. తెలివి తక్కువవాళ్ళు! ఏం తెలియదు వాళ్ళకి. అంతెత్తునించిదూకిపడితే కాళ్ళూ. చేతులూ విరిగి మనిషి చచ్చిపోడూ?

డాక్టరుగారు ఇంజక్షనిచ్చి వెళ్ళగానే నాకు మత్తులానిద్ర ముంచుకు రాసాగింది. మళ్ళీ ఎప్పటికి ఇంటికి వెళ్ళనిస్తారో!

అలా నిద్రలోకి జారుకుంటున్న సమయంలో ఆ సన్నని కీచుపాట మళ్ళీ వినవచ్చింది. కీచు గొంతుతో ఎవరో అంటున్నారు "హుజూర్! సిపాయి హాజిర్!" కళ్ళు తెరిచి చూశాను మంచం పక్క పొట్టి టేబిల్ మీద తెల్లదువ్వటి పైన. మందుసీసా పక్కగా రొమ్ము విరుచుకుని నిలబడి వున్నాయి రెండు ఎర్రచీమలు పెద్దవి కొమ్మ అందుకున్న సమయంలో అవి నా చేతిమీదుగా లోపలికి ప్రవేశించి వుంటాయి. నాకు తెలియనే లేదు!

నేనన్నాను "సిపాయి?"

"జీ హుజూర్"అని జవాబు వచ్చింది.

"మీ పేర్లేమిటి?"

ఒకడి పేరు లాల్ బహదూర్ సింగ్. ఇంకొకడు లాల్ చంద్ పాండే.

నాకు భలే సంతోషంగావుంది వాళ్ళని జాగ్రత్తగా వుండమని చెప్పాను. మనుషులెవరేనా వస్తే దాక్కోమని. లేకపోతే వెతికి పట్టుకుని చంపేస్తారు. లాల్ బహదూర్ సింగ్. లాల్ చంద్ పాండే. యిద్దరూ దర్జాగా సలాం చేశారు: "బహుత్ అచ్చా హుజూర్" అన్నారు. ఆ పైన వాళ్ళిద్దరూ చమత్కారమైన పాట అందుకున్నారు. అది వింటూ వింటూ నిద్రలోకి జారిపోయాను.

నిన్న జరిగింది చెపుతాను టూకీగా- అప్పుడే అయిదు గంటలు కొట్టింది గడియారం. డాక్టరుగారు వచ్చే వేళయింది.

నిన్నసాయంకాలంవేళ లాల్ బహదూర్ సింగ్. లాల్ చంద్ పాండేలు కుస్తీ విద్య చూపిస్తున్నారు టేబిల్ మీద చేరి. నేను పక్కమీద పడుకుని చూస్తున్నాను. ఇది నిద్ర పోవలసిన వేళ. నిన్న మాత్ర యిచ్చినా. ఇంజక్షన్ యిచ్చినా నిద్ర రాలేదు. నాకే నిద్ర పోవాలనిలేదు- కుస్తీ జోరుగా సాగుతోంది. ఎవరు గెలుస్తారో తెలియడం లేదు. సరిగ్గా ఆ సమయంలో టకటక బూట్ల చప్పుడయింది. వచ్చేస్తున్నాడు డాక్టరుగారు. నేస్తాలికి సంజ్ఞ చేసే సరికి ఇద్దరూఉలిక్కిపడి కుస్తీ ఆపేశారు. లాల్ బహదూర్ సింగ్ చటుక్కుని టేబిల్ కింద దూరాడు. కుస్తీలో అలసిపోయాడేమో. లాల్ చంద్ పాండే పారిపోలేకపోయాడు. దాంతో పెద్ద రభస జరిగిపోయింది.

డాక్టరుగారువచ్చి టేబిల్ మీద చీమని చూసి కోపంగాఇంగ్లీషులో ఏదోఅన్నాడు. అనేసి లాల్ చంద్ ని టేబిల్ మీంచి కిందికి తోసేశాడు. పాపం అతని అరుపు వింటేనే నాకు బోధపడింది-బాగా దెబ్బలు తగిలాయని. కాని నేనేం చెయ్యగలను? పరీక్ష పూర్తిచేసి డాక్టరుగారు రోజూలాగే మొహం ముడుచుకుని వెనక్కి తిరిగి పోతున్నాడు అలవాటుప్రకారం మీసాల కింద గోక్కుంటూ గుమ్మం దగ్గరకి వెడుతున్నవాడల్లా. హఠాత్తుగా "అరె! అయ్యో:" అంటూ అరుస్తూ గంతులు మొదలెట్టాడు. మెడలోంచి స్టెతస్కోపు కింద పడిపోయింది. కళ్ళజోడు కిందపడి పగిలిపోయింది తొందర తొందరగా కోటు తీసెయ్యాలని చూట్టంలో ఒక బొత్తాం ఊడిపోయింది. టై విప్పుకోబోయి మెడకి మరింత. గట్టిగా బిగించుకున్నాడు- ఎలాగైతేనేం గబగబా షర్టు విప్పేశాడు. చివరికి బనీను కూడా తీసేశాడు ఇంగ్లీషులోనూ. బెంగాలీలోనూ కలిపి తిట్టేస్తున్నాడు. బనీను తీసేసినా డాక్టరుగారు కుప్పిగంతులు మానలేదు. "ఏమయింది సార్. ఏమయింది సార్" అంటోంది నర్సు.

"యాంట్సు. యాంట్సు.రెడ్ యాంట్సు చొక్కా చేతికింద....అబ్బబ్బ" అంటున్నాడు.

ఇంకా తెలియకుండా వుంటుందా నాకు? ఆ షర్టు చేతికిందినించి దూరి వెళ్ళింది తన నేస్తాన్ని కొట్టినందుకు ప్రతీకారం తీర్చుకోడానికి లాల్ బహదూర్ సింగ్.

ఆ సమయంలో నన్ను చూసినవాళ్ళు మళ్ళీ అనరు- సదానంద్ కి నవ్వడం చేతనవునా. అని.